# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశంలో స్థానిక ఉత్పత్తుల తయారీని పెంచాలని భారత ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధంకడ్ పరిశ్రమలకు పిలుపునిచ్చారు.

2. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా ఆదుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

3. తెలంగాణా రాష్ట్రంలో మూసీ నదిని సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఐ.టి. శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు.

4. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

5. తుంగభద్ర డ్యాంలో గల్లంతైన 19 వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు పనులు విజయవంతమయ్యాయి.

6. దేశంలో మంకీ పాక్స్ కేసులు ఎక్కడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

==========================

భారత దేశం స్వయం సమృద్ధి సాధించడానికి వీలైనంతగా దిగుతుమలు తగ్గించి స్థానిక ఉత్పత్తుల తయారీని పెంచాలని ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధంకడ్ పిలుపు నిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం పట్టణంలో నిన్న జరిగిన స్వర్ణ భారత్ ట్రస్టు 23 వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ …. అనవసరమైన వస్తువులను దిగుమతి చేసుకోవడం వల్ల ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఉంటుందని …., అంతేకాకుండా విలువైన విదేశీ మారక ద్రవ్య నిల్వలు తరిగిపోతాయని అన్నారు. అందువల్ల …. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని, అదే సమయంలో సహజ వనరులను అవసరాల మేరకు ఉపయోగించాలని జగ్ దీప్ ధంకడ్ సూచిస్తూ …………….

…..వాయిస్…. సెకన్లు….

పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ …. భారత దేశ సంస్కృతీ సంప్రదాయాలు ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

---------------------------

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలుసుకుని రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలను చర్చించారు. ప్రధాన మంత్రితో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఆయనకు చంద్రబాబు నాయుడు వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని ...., పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. రాష్ట్ర రుణాలను రీ షెడ్యూల్ చేయాలని కూడా కోరినట్టు తెలుస్తోంది.

ప్రధాన మంత్రితో సమావేశానంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ...., కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా లను కూడా చంద్రబాబు నాయుడు కలుసుకున్నారు. రాష్ట్రాభివృద్ధి ..., సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని నిర్మలా సీతారామన్ ను చంద్రబాబు నాయుడు కోరినట్టు సమాచారం. కేంద్ర ఉక్కు ..., గనుల శాఖ మంత్రి కుమార స్వామితో కూడా చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్ల రూపాయల మేర ఆర్థిక సహాయాన్ని నిర్మలా సీతారామన్ ఇటీవల కేంద్ర బడ్జెట్ లో ప్రకటించారు.

---------------------------

ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని రాజమహేంద్రవరం ..., విజయవాడ ...., కడప విమానాశ్రయాల్లో టెర్మినల్ సామర్థ్యం పెంపు పనులపై ఈ సందర్భంగా కేంద్ర మంత్రితో ఆయన చర్చించారు. ఈ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

అనంతరం .... రామ్ మోహన్ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ .... ఆంధ్ర ప్రదేశ్‌లోని ఏడు విమానాశ్రయాలను 14కు పెంచాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. శ్రీకాకుళం ..., దగదర్తి ..., కుప్పం ...., నాగార్జున సాగర్ లలో విమానాశ్రయాలను ఏర్పాటు చేయడానికి గుర్తించామని పేర్కొన్నారు. ఈ విషయంలో విమానయాన శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు వేదుతుందని ...., విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటున్నామని రామ్ మోహన్ నాయుడు వివరించారు.

---------------------------

హైదరాబాదులో భవిష్యత్ లో ఏర్పాటు చేయబోయే నగరం గురించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిన్న పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. విమానాశ్రయం నుండి నాలుగవ నగరానికి రహదారి ...., మెట్రో సౌకర్యాన్ని అనుసంధానం చేయడం .., మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలు ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో మూసీ నదిని సుందరంగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి. శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... మూసీ నది

పునరుజ్జీవం కోసం పలు అధ్యయనాలు చేశామని, ఈ అంశంపై ప్రపంచ బ్యాంకు అధ్యక్షునితో కూడా చర్చలు జరిపామని చెప్పారు. రాష్ట్రంలో 31 వేల 500 రూపాయల మేర పెట్టుబడులు పెట్టేందుకు 19 సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నామని, ఈ ఒప్పందాల వల్ల 30 వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీధర్ బాబు వివరించారు.

---------------------------

భారత వాతావరణ సంస్థ సూచనల మేరకు ఉత్తర కర్నాటకను ఆనుకుని ఉన్న తెలంగాణా ప్రాంతంలో ఆవర్తనం విస్తరించి ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణా సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం ...., అల్లూరి సీతారామరాజు...., పార్వతీపురం మన్యం ...., విశాఖపట్నం ..., అనకాపల్లి ..., కాకినాడ ....., తూర్పు గోదావరి...., ఏలూరు ... ప్రకాశం ...., నంద్యాల జిల్లాలలో ఈ రోజు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మరొక వైపు .... కోనసీమ ...., పశ్చిమ గోదావరి ..., కృష్ణా ...., ఎన్.టి.ఆర్. ...., గుంటూరు ...., బాపట్ల ...., పల్నాడు తదితర జిల్లాల్లో కూడా తేలిక పాటు వర్షాలు కురియవచ్చునని పేర్కొంది.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలోని పలు జిల్లాలలో ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది. నిర్మల్ ..., నిజామాబాదు ...., కరీంనగర్ ...., పెద్దపల్లి ...., భూపాలపల్లి ....., ములుగు ....., వరంగల్ ..., హనుమకొండ ...., సిద్దిపేట ...., వికారాబాదు ..., సంగారెడ్డి ...., మెదక్ ..., కామారెడ్డి ...., మహబూబ్ నగర్ .... తదితర జిల్లాలలో ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ...., మిగతా చోట్ల ఉరుములు ..., మెరుపులు ..., ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురియవచ్చునని హైదరాబాదు వాతావరణ కేంద్రం ఒక ప్రకటనలో వివరించింది.

---------------------------

తుంగభద్ర డ్యాంలో గల్లంతైన 19 వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. ఈ పనులు చేపట్టిన 24 గంటలలోపే అయిదు బ్లాక్‌లలో స్టాప్ లాగ్ ఎలిమెంట్లను అధికారులు విజయవంతంగా అమర్చారు. 4 అడుగుల ఎత్తు ...., 60 అడుగుల వెడల్పుతో స్థాప్ లాగ్ ఎలిమెంట్లను అమర్చి వృధాగా పోతున్న నీటిని అధికారులు పూర్తిగా అడ్డుకున్నారు. తుంగభద్ర బోర్డు...., ఆంధ్ర ప్రదేశ్ ...., కర్ణాటక రాష్ట్రాల అధికారుల ఉమ్మడి కృషి ఫలితంగా డ్యాంలోని నీరు వృధా కాకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. డ్యాం ల గేట్ల తయారీలో నైపుణ్యం కలిగిన సాగునీటి నిపుణులు కన్నయ్య నాయుడు ఈ బృందానికి నాయకత్వం వహించారు. ఇలాఉండగా .... అసాధ్యమైన పనిని అధికారులు సుసాధ్యం చేశారని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు.

---------------------------

దేశంలో ఇప్పటి వరకు మంకి పాక్స్ కేసులు ఎక్కడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మంకీ పాక్స్ ను అంతర్జాతీయ ఆందోళనకు గురి చేసే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన దృష్ట్యా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె. పి. నడ్డా నిన్న డిల్లీలో నిర్వహించిన ఉన్నత స్థాయీ సమావేశంలో మంకీ పాక్స్ గురించి సమీక్షించారు. ఈ వ్యాధి కేసులు ఎక్కడా నమోదు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్ని విమానాశ్రయాలు .... ఓడ రేవులు

తదితర ప్రాంతాలలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ...., ఆరోగ్య సదుపాయాలను కల్పించాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నడ్డా అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. మొత్తం 12 శాఖలలో బదిలీలకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించింది. ప్రజా సంబంధిత సేవల్లో ఉండే శాఖలలో మాత్రమే బదిలీలకు అనుమతించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో ఏదైనా కారణంతో రెండు లక్షల రూపాయల రుణ మాఫీ జరగని రైతుల వివరాలు సేకరిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ...... ఇందుకు సంబంధించిన వివరాలను పోర్టల్‌లో పొందుపరచాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. రెండు లక్షల లోపు ఉన్న రైతు రుణాలను మాఫీ చేశామని....., ఇప్పటి వరకు 22 లక్షల 37 వేల మందికిపైగా రైతుల ఖాతాలలో నిధులు జమ చేశామని ..., రుణ మాఫీ కోసం 17 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు విడుదల చేశామని తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో వచ్చే దసరా పండుగ నుండి నైపుణ్య విశ్వవిద్యాలయం కోర్సులు ప్రారంభిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ అంశంపై హైదరాబాదులో నిన్న ఆమె ఉన్నత స్థాయీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ .... మొత్తం 20 నైపుణ్య కోర్సులను గుర్తించామని ...., మొదట స్కూల్ ఆఫ్ ఈ – కామర్స్ ..., లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్ ..., డిప్లొమా కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. ఇందు కోసం అనేక కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని శాంతి కుమారి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ భూములను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సీసోడియా అన్నారు. విశాఖ పట్నం పర్యటనలో వున్న ఆయన నిన్న పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం సిసోడియా పాత్రికేయులతో మాట్లాడుతూ..... ఈ భూముల పరిస్థితుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

======================